# అపస్వరం

చెయ్యక తప్పని ప్రయాణం. ముందుగా నిర్ణయించుకునే వ్యవధిలేక పోయింది. క్యూలోంచి టిక్కెట్ అందుకుని ఎలాగో బయటపడి, ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చాను. తాంబూలాలిచ్చాను, తన్నుకు చావండి అన్నట్లు గార్డు విజిల్ వేసి, జెండా ఊపాడు. రైలుకదలడమే తరువాయి, హైరానపడడం నావంతు అయింది. అటు చూస్తే ఎ/సి కంపార్ట్‌మెంటు ఇటు చూస్తే మొదటి తరగతి పెట్టెలు. ఇంకా ముందుకుపోతే టూటైర్ - త్రీటైర్ స్లీపర్ కోచీలు. నాచేతిలో ఉన్నది సాధారణమైన రెండవ తరగతి టిక్కెట్. రైలుకదులుతోంది ఎదుటికి వచ్చిన పెట్టెలోకి ఎక్కి, తలుపుకి అడ్డుగా నిల్చున్న వ్యక్తిని, కాస్త నిలుచునే జాగా ఇమ్మని అభ్యర్థించి, కాలుమోపినంత స్థలం చేసుకుని నిట్టూర్చాను.

రైలు పెట్టె రేపో నేడో ప్రసవించబోయే నిండు చూలాలులా ఉంది. ఒక్కడు కూర్చునే సీటులో ఇద్దరూ, ఐదూ, ఆరుగురూ కూర్చో వలసిన బెంచీమీద ఏడుగురో ఎనమండుగురో సర్దుకుని కూర్చోగా నిలబడిన జనం మీద ఇసుకవేస్తే నేలరాలని జనసమ్మర్దం. తనకేమీ

పట్టినట్టు రైలు వేగంపుంజుకుంది. ఇద్దరు మీసాల పక్షులు లంక పొగాకు చుట్టలు తీసి, ఆప్యాయంగా వాటిని చూసుకుంటూ ముట్టించారు. ఈ కాలుష్యం చాలదన్నట్లు ఇంకో ఆయన జర్దాపాన్ తుంపరలతో అందరినీ పునీతంచేస్తూ దేశంలోని అనర్థాలను ఏకరువు పెడుతున్నాడు. మీసాల పక్షుల మధ్య ఇరుక్కుపోయిన పెద్దమనిషి ఒకడు "అయ్యా, మీరు పొగత్రాగడమే కాక నాచేత కూడా బలవంతాన త్రాగించేస్తున్నారు. ఇప్పటికే నా ఊపిరితిత్తులు పొగతో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాయి" అన్నాడు. "ఇరవయ్యోశతాబ్ది అంతం కాబోతూంది ఇంకా ఈ మాత్రం పొగకు అలవాటు పడకపోతే ఎలాగండీ" అంటున్నాడు చమత్కారంగా ఇద్దరిలో ఒక మీసాల పక్షి. నేను సైన్సుమాష్టరుగా బ్రతుకు వెలగబెట్టి రిటైర్ అయిన వాణ్ణి. చిన్న చిన్న కుర్రవెధవల చేత రాజ్యాంగం అంత బరువైన పుస్తకాలు మోయించి స్వచ్ఛమైన గాలీ, వెలుగూ ఆరోగ్యవంతమైన జీవితానికి ఎంత అవసరమో బోధించినవాణ్ణి. ఆచరణ యోగ్యంకాని నా ఉపన్యాసాలు, పాఠాలు గుర్తుకి వచ్చి నాలోనేనే నవ్వుకున్నాను.

ఇంతలో రైలుపెట్టెలో ఏదో కలకలం మొదలైంది. ఒక బెంచీ మీద కూర్చున్న వాళ్ళంతా ఏదో తేలో పామో వచ్చినట్లు చటుక్కున లేచి నిల్చున్నారు. ఏమైందన్నట్లు నేను నా ప్రక్కనున్న యువకుడి వేపు చూశాను. "ఆ పెద్దమనిషి జ్వర బీమారున్నడు. బేహోషయ్యిండు. పండబెట్టిన్రు" అన్నాడు, అతి సామాన్య విషయంలాగ ఆయువకుడు. ఆ పడుకున్న మనిషి ముఖం మీద ఒక బట్టతల మనిషి తన మరచెంబులో నీళ్ళుజల్లి ఉపచర్యచేస్తున్నాడు. నాకు కాసింత దూరాన ఉన్న ముసలాయన ఒకడు "పాపం బలహీనంగా ఉన్నట్లున్నాడు. అసలేగాలి ఆడటంలేదు" అన్నాడు జాలిగా. ఇది విని ఊరుకోక

ఒక నడివయస్కుడు కాస్త స్వరం తగ్గించి "ఈ మధ్య ఇదొక వేషం ఆయిపోయింది. అందర్నీ బాధ పెట్టి పడుకుని ప్రయాణం సాగించడానికి" అన్నాడు. ఈ సణుగుడు మాటలు ఎలా విన్నాడో ఏమోకాని ఆ బట్టతలాయన వేంటనే జవాబుగా అందుకుని "మానవత్వం ఉండొద్దటయ్యా, ఒంట్లో బాగులేకుంటే వేషం అంటావా? ప్రతీ పెట్టెలో ఆరోగ్యం సరిలేని వాళ్ళకు రెండు బెంచీలు ప్రత్యేకించి అట్టే పెడితేనే కానీ నీలాంటి వాళ్ళ తిక్క కుదరదు" అన్నాడు ఆవేశంతోటి. ఇంతలో ఓ కండువా వేసుకున్న వ్యక్తి గొంతు సవరించుకొని "ఇప్పుడు నిద్రపోవడానికి ప్రత్యేకించి రైలుపెట్టెలు లేవటయ్యా! బెంచీలు కూడా ప్రత్యేకించాలా" అని మూలిగాడు. ఇలాసాగుతోంది వాగ్వివాదం. బెంచీమీద పడుకున్న వ్యక్తి కాస్త సేదదీరి, అందరివేపూ బేలగాచూసి, నెమ్మదిగా నిద్రలోకి జారి గురక పెడుతున్నాడు. నా వెనుక నిలబడ్డ ఒక ఆ సామి మాత్రం ఇబ్బందిగా కదుల్తూ చెవిలో గొణుగుతున్నాడు." ఏమిటో ఆ వెర్రిబాగులవాడు మనసులోని మాట పైకి అనేసి చెడ్డ అయిపోయాడు కాసి. సర్దుకుపోవడానికైనా ఒక హద్దు ఉండవద్దండీ. నిలుచున్నవాడు అమాంతం బెంచీమీద పడుకుని బెంచీమీద కూర్చున్న వాళ్ళంతా నిలబడితే ఆ జాగా పైనుంచి ఊడిపడిందటండీ. లేకపోతే రైలు పెట్టె వెడల్పాయి పోయిందా. ఆ నిలుచున్న వాళ్ళ ఒత్తిడి మన అందరిమీదాపడలేదూ. రెండుకాళ్ళ మీద నిలబడి ప్రయాణం సాగిస్తున్న వాళ్ళు కాస్తా ఒంటికాలు మీద నిలబడి సర్దుకోవడంలేదూ. ఇలా ఎంతదూరం ప్రయాణం చేస్తాం" - అని వివరిస్తున్నాడు. ఏదో ప్రశాంతంగా సాగవలసిన ప్రయాణం ఈ వాగ్వాదంతో చాలా సీరియస్ వ్యవహారంగా విషమించేసరికి పరిస్థితి కాస్త తేలికపరుద్దామా అన్నట్లు ఇందాక లంకపొగాకు చుట్ట త్రాగిన ఒక మీసాలాయన "అయ్యా మా బాధ మాది మా పొగత్రాగే వాళ్ళకు ఒక ప్రత్యేకమైన కంపార్టుమెంట్ తగిలిస్తే మేం ఎవర్ని బాధ పెట్టకుండా పొగత్రాగవచ్చుకదా"

అన్నాడు. ఈ అప్రస్తుత హాస్యానికి కొందరు గొల్లున నవ్వితే కొందరు ముఖం చిట్లించుకున్నారు.

ఇంతవరకూ మౌనముద్రలో ఉన్న ఒక స్టూడెంటు కుర్రాడు "అయ్యా! ప్రతీవాడూ ప్రత్యేక సదుపాయాలు కావాలనడమో, ఉన్న సదుపాయాలు కాపాడుకోవడమో తప్ప, మునుకులు రెండూ దగ్గరగా చేర్చి కాస్త కూర్చోగల కనీస సదుపాయం టిక్కెట్ ఇచ్చిన ప్రతీ ప్రయాణికుడికీ అందేటట్టు చెయ్యడం మీ విధికాదా అని రైలు నడిపే వాళ్ళని నిలదీసి అందరూ అడిగితే ఈ దౌర్భాగ్యపు రైలుప్రయాణాలు ఇలా ఎందుకు ఏడుస్తాయి చెప్పండి" అన్నాడు-సామ్యవాద ధోరణిలో. దీనికి జవాబుగా కిటికీదగ్గర నుంచున్న తాతగారు గొంతు కలిపారు. "ఎవరి ప్రత్యేక సదుపాయాలు వారు పరిరక్షించి, కొనసాగించుకుంటూ ఉంటే, క్రొత్తవాళ్లు అలాటి సదుపాయాలకు ఎగబడుతూ ఉంటే, అందరికీ ఉండవలసిన కనీస సౌకర్యానికి దిగులు ఎవరికి పట్టింది బాబూ! రైలులోని ప్రయాణికులంతా ఒక్కటి అన్న అభిప్రాయం అసలు ఏనాటికైనా కలుగుతుందంటావా?" అని ఎదురు ప్రశ్నవేశారు. నా రెండవ కాలు నేలమీద నిలపలేక, ప్రక్కనున్న ప్రయాణీకుడి కాలుమీద పెట్టే సాహసమూలేక, ఒంటికాలు మీద నిలబడి నా శరీరం బరువుకాస్త గోడకు ఆనించి నిట్టూర్చాను. సాగవలసిన దూరం చాలానే ఉంది. ఎన్నికల సమయంలో ప్రయాణాలు ఇలానే అఘోరిస్తాయేమో. ఎన్ని ధోరణులు. ఎంత వైవిధ్యం అనుకున్నాను. "ఏమి జన్మము ఏమి జీవనమూ అని అపస్వరంతో ఒక బిచ్చగాడు తత్త్వం పాడుతున్నాడు. రైలు మాత్రం తనకేమీ పట్టనట్టు పరుగులీస్తోంది.

సాధన-మార్చి-ఏప్రిల్-1987